ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని ఆర్టీజీ కేంద్రంగా అన్ని శాఖలు ఉపయోగించుకుని సత్వర సేవలు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.
- ❖ రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు 99 మందితో కూడిన జాబితాను ఈరోజు ప్రకటించింది.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల దేవాలయాల పాలకమండళ్లను త్వరలోనే నియమిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.
- ❖ అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలలో ఈరోజు “పొలం పిలుస్తోంది” కార్యక్రమం నిర్వహించారు.
- ❖ ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయంలో ఉన్న రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజీ) సెంటర్ ను ఈ రోజు సందర్శించారు. ఈ ఆర్టీజీ కేంద్రం పనితీరును ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిరబ్ కుమార్ ప్రసాద్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ద్వారకా తిరుమలరావుతో సహా ఉన్నతాధికారులతో ఆర్టీజీ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సమావేశమయ్యారు. ఆర్టీజీ ద్వారా పౌరసేవలను సులభతరం చేయడం... పాలనలో వేగం పెంచడంపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. రానున్న రోజుల్లో ఆర్టీజీ ద్వారా చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. “ప్రజలకు సంబంధించిన మాస్టర్ డాటాను ఆర్టీజీ కేంద్రంగా అన్ని శాఖలు ఉపయోగించుకుని సత్వర సేవలు అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఆధార్, వాక్సినేషన్

డాటా, స్కూల్ అడ్మిషన్, రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్ల వంటి కార్యక్రమాలు ప్రజలకు సులభంగా అందేలా పాలసీలు రూపొందించి అమలు చేయాలని సూచించారు.

==========================

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు 99 మందితో కూడిన జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ప్రకటించింది. ఇందులో భాగంగా 20 కార్పొరేషన్లకు నూతన ఛైర్మన్లు, సభ్యులను నియమించింది. ఈ నియమకాల్లో ఆర్టీసీ ఛైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణను, వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్ ను నియమించింది. అలాగే 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా భారతీయ జనతా పార్టీకి చెందిన లంకా దినకర్, శాప్ ఛైర్మన్‌గా రవినాయుడును ఎంపిక చేసింది.

==========================

టీటీడీ పాలకమండలితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల దేవాలయాల పాలకమండళ్లను త్వరలోనే నియమిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు ఆయన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... త్వరలోనే టీటీడీ పాలకమండలి నియామకం జరుగుతుందని వెల్లడించారు. లడ్డు ప్రసాదం వివాదంతో పాటు తిరుమలలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సిట్ దర్యాప్తునకు ఆదేశించిందని తెలిపారు. సిట్ నివేదిక వచ్చిన తరువాత విజిలెన్స్, సిట్ నివేదికలపై ప్రభుత్వం పరిశీలన జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో నెయ్యితో పాటు ముడి సరుకులను, నాణ్యతను పరిశీలించాకే వినియోగించాలని ఆలయ అధికారులకు ఆదేశించామని వెల్లడించారు. అక్టోబర్ 4 నుంచి ప్రారంభం కానున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.

==========================

ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వాట్సప్ నంబరును ఈ రోజు మంత్రి ప్రారంభించారు. స్థానిక కొత్తపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 11 శాఖలకు సంబంధించిన డివిజనల్ స్థాయి అధికారులు 76 5993 5993 వాట్సప్ నంబరులో 24 గంటలూ అందుబాటులో ఉంటారని అన్నారు. ప్రజలు తమ ఇబ్బందులను ఫొటోతో పాటు సందేశాన్ని సంక్షిప్తంగా ఈ నెంబర్‌కు పంపడం ద్వారా వెంటనే స్పందించి సమస్య పరిష్కరించడం జరుగుతుందని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

==========================

వ్యవసాయ రైతులకు ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్రాలను అందిస్తుందని అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల వ్యవసాయాధికారిణి లీలా వతి తెలిపారు. ఈరోజు మఠం పంచాయతీ ఎం. బొడ్డ పుట్టు గ్రామంలో జరిగిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ... రైతులు సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయటం వల్ల భూమి సారం పెరిగి, పంట అధిక దిగుబడులు రావటానికి అవకాశం ఉందన్నారు. కాఫీ, మిరియాలు, పసుపు, పిప్పళ్లు, వరి, రాజ్మా, రాగులు తదితర పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం పంట పొలాల వద్ద జీవామృతం తయారు చెయ్యటంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ఏర్పడితే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తామని ఆమె తెలిపారు.

విరామం

============================

విశాఖపట్నంలోని డాక్టర్ రాణి చంద్రమణి దేవి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ నిర్వహిస్తోన్న జీవవైవిధ్య ఉద్యానవనాన్ని కాకినాడ మెడికల్ కళాశాల విద్యార్థులు ఈరోజు సందర్శించారు. ఏక్ పేడ్ మా కే నామ్ "అమ్మ పేరిట ఒక్క మొక్క" అనే నినాదం మేరకు విద్యాపర్యటలో భాగంగా ఇక్కడ పెరుగుతున్న వివిధ వృక్షజాతులను వారు పరిశీలించారు. మొక్కల ప్రాశస్త్యాన్ని ఉద్యానవన నిర్వహకులు విద్యార్థులకు వివరించారు. ఉష్ణ, శీతోష్ణ, సమశీతోష్ణ మండలాల్లో పెరిగే వివిధ జాతుల మొక్కలతో పాటు, వేదకాలంలో చెప్పబడే దేవతావృక్షాలు, నక్షత్రవనంలోని మొక్కలను పరిశీలించి వాటి శాస్త్రీయ నామాలపై విద్యార్థులు అవగాహన చేసుకున్నారు.

============================

ప్రతినిత్యం సమాజ ఆరోగ్య రక్షణను కోరుకునే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అన్నారు. "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అన్నీ ప్రాంతాల్లో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నమని తెలిపారు.

============================

మహాత్మా గాంధీ కలలు కన్న స్వచ్ఛమైన దేశాభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్'లో అందరూ భాగస్వాములు కావాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ రోజు శ్రీకాకుళంలో నగరపాలక సంస్థ, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల సంయుక్తగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 10 సంవత్సరాల క్రితమే "స్వచ్ఛ భారత్" కార్యక్రమం ప్రవేశ పెట్టిందని, తద్వారా ప్రజల్లో పారిశుద్యంపై మంచి అవగాహన కలిగిందన్నారు.

============================

ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఈ రోజు పశ్చిమ మధ్య బంగాళాఖాతం, సరిహద్దు ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని ఉన్న ఉపరితుల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వాతావరణ శాఖ అధికారిణి తెలియజేస్తూ....

(వాయిస్ 26 సెకన్లు)

============================

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం శ్రీ) పధకానికి పార్వతీపురం మన్యం జిల్లా నుండి 19 పాఠశాలలు ఎంపిక అయ్యాయని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పి.ఎం శ్రీ పధకానికి జిల్లా నుండి 19 పాఠశాలలు అర్హత సాధించాయని, అందులో 2 ప్రాధమిక పాఠశాలలు, 17 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ పాఠశాలలలో జాతీయ విద్యా విధానం అమలులో ఉంటుందని, ఈ పధకం 2022-23 నుండి 2026-27 సంవత్సరాల వరకు 5 సంవత్సరాల పాటు అమలు జరుగుతుందని తెలిపారు. 19 పాఠశాలలలో మౌళిక సదుపాయాలు కల్పనకు గాను ఈ పధకం ద్వారా అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందనివెల్లడించారు. పి.ఎం శ్రీ పాఠశాలలో ఇప్పటికే వెబ్ సైట్లు, సోషల్ మీడియా ప్లాట్ ఫాంలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పధకం క్రింద 14 పాఠశాలలకు క్రీడ మైదానాలకు, 5 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ లాబ్ లకు నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ వివరించారు.

===========================

“హజ్ యాత్ర” కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును మరోసారి పొడిగించామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ దరఖాస్తుల ఫారమ్‌లను పూరించడానికి కేంద్ర హజ్ కమిటీ దరఖాస్తు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించిందని ఆయన పేర్కొన్నారు. “హజ్ యాత్ర” కోసం దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తామని మంత్రి వెల్లడించారు.

===========================

===========================